క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గట్టు: నిరంతరం విద్యుత్‌ను అందించే క్రమంలో గురువారం గట్టు సబ్‌స్టేషన్ పరిధిలో గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ గోవిందు, ఏఈ చెన్నయ్యలు తెలిపారు. గట్టు సబ్ స్టేషన్‌లో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గట్టు, సల్కాపుర, రాయాపురం, గంగిమాన్‌దొడ్డి, యల్లందొడ్డి గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏడీఈ, ఏఈలు తెలిపారు. రైతులు, గృహ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆరుగురికి రిమాండ్

ఉండవెల్లి: మండలంలోని డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఆరుగురు వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఆరుగురిని అలంపూర్ జడ్జి కవిత ఎదుట హాజరుపరిచారు. ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున జరిమాన విధించి, 3రోజులు ముగ్గురికి, 4 రోజులు మరో ముగ్గురిని రిమాండ్ విధించారు. ఐదుగురు ఉండవెల్లి మండలం, ఒకరు అలంపూర్ మండలానికి చెందిన వారిగా ఎస్‌ఐ తెలిపారు.

పాఠశాలకు డ్రమ్స్ వితరణ



అయిజ: మండలంలోని భూంపురంలో బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన రమేష్ డ్రమ్స్ వితరణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు రమేష్‌ను శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వకుళ మాలవిక, ఉపాధ్యాయులు భీమేశ్వర్‌రెడ్డి, రఫి, ఉమాదేవి, రాజగోపాల్ రెడ్డి, భాస్కర్, పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోండి

అయిజ: దళిత మహిళపై థర్డ్ డిగ్రీని ప్రయోగించిన పోలీస్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకురాలు ప్రేమలత బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దొంగతనం చేసినట్లు ఒప్పుకోవాలని దుర్మార్గంగా ప్రవర్తించారని వాపోయారు. మహిళపై ప్రవర్తించిన తీరు సిగ్గుచేటని పేర్కొన్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా కృష్ణ

గద్వాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా కృష్ణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ధరూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తూ బదిలీపై గద్వాలకు వచ్చారు. ఇక్కడ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న హృదయరాజ్ ధరూర్ కళాశాలకు బదిలీపై వెళ్లారు. కృష్ణకు కళాశాల అధ్యాపకులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆదిశిలా క్షేత్రంలో సప్తాహ భజన



మల్దకల్: ఆదిశిలా క్షేత్రం లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సప్తాహ భజన కొనసాగుతోంది. బుధవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భజన మండలి సభ్యులు భజనలో పాల్గొన్నారు. వారం రోజుల పాటు నిరంతరంగా కొనసాగే ఈ సప్తాహ భజన మండలి సభ్యులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాద రావు, ఈఓ సత్యచంద్రారెడ్డి, అర్చకులు రమేషాచారి, మధుసూదనాచారి పాల్గొన్నారు.

పంటల నమోదు

మానవపాడు: మండలంలోని అమరవాయి గ్రామంలో బుధవారం మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో పంటల నమోదు కార్యక్రమం నిర్వహించారు.

ప్రమాదకరంగా అప్రోచ్ రోడ్డు

అయిజ: మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాల సమీపంలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి మట్టిరోడ్డు కుంగిపోయి ప్రయాణానికి ప్రతికూలంగా మారింది. రోడ్డుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంతో కొన్ని రోజుల క్రితం కాంట్రాక్టర్ అప్రోచ్ రోడ్డును ఏర్పాటు చేశారు. నాసిరకంగా అప్రోచ్ రోడ్డు నిర్మించడంతో వర్షానికి మట్టిరోడ్డు కుంగిపోయింది. బుధవారం ఆ రోడ్డుపై వెళ్తున్న వాహనాలు మట్టిలో దిగబడిపోయాయి. వాహనాలు రోడ్డుపై వెళ్తే గుంతలో పడిపోయే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బస్‌షెల్టర్ లేక అవస్థలు

- శాంతినగర్ పట్టణంలో ప్రయాణికుల అవస్థలు
- కర్నూలు, రాయచూరు వెళ్లే వారికి తప్పని తిప్పలు
- ఎండ, వానకు రోడ్డుపై నిల్చొనే దుస్థితి
- బస్టాప్‌లు ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రజలు



బస్టాప్‌లో బస్సుకోసం వేచి చూస్తున్న ప్రయాణికులు(ఫైల్)

శాంతినగర్: పట్టణ ప్రజలు బస్సు ప్రయాణం చేయాలంటే ఎండా వానకు తడవాల్సిందే. లక్షల కోట్లు వెచ్చించి ప్రజలకు ప్రయాణ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం సంకల్పిస్తే, అందుకు భిన్నంగా పరిస్థితులున్నాయి. బస్టాప్‌ల ఆవరణలో నిలువ నీడలేక వృద్ధులు, వికలాంగులు, మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ పట్టణం నుంచి తెలంగాణతో పాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ప్రజలు బస్సుల్లో ప్రయాణం సాగిస్తుంటారు. శాంతినగర్ నడిబొడ్డున గతంలో రెండు చోట్ల పోలీసుల ఆధ్వర్యంలో బస్టాప్‌ల నిర్మించారు. మున్సిపాలిటీ రోడ్డు విస్తరణలో భాగంగా రెండు షెల్టర్లను తొలగించారు. రోడ్డు నిర్మాణపనులు పూర్తికాలేదు. దీంతో ప్రయాణికులకు నిలువ నీడలేదు. వర్షం కురిస్తే తడవాల్సిన పరిస్థితులు దాపురించాయి. కూర్చోవడానికి కనీస సౌకర్యాలు లేకపోవడంతో కంకరమయమైన రోడ్డులో గంటలపాటు నిల్చొని ప్రయాణిస్తున్నారు. ఈ విషయమై మున్సిపాలిటీ, ఆర్‌అండ్‌బీ, టీజీఎస్ ఆర్టీసీ అధికారులు స్పందించి ప్రయాణికుల సౌకర్యం కోసం రెండు షెల్టర్లను తిరిగి నిర్మించి, ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

రెండు కిలోమీటర్ల దూరంలో బస్టాండ్

శాంతినగర్ పట్టణ మధ్యలో నుంచి ప్రభుత్వం నిర్మించిన ఆర్టీసీ బస్టాప్ వరకు వెళ్లాలంటే రెండు కిలోమీటర్ల దూరమవుతుంది. కాలినడకన వృద్ధులు, వికలాంగులు, మహిళలు, చిన్నారులు నడిచి వెళ్లలేని పరిస్థితి. దీంతో పట్టణంలోని కూడళ్లలో నిల్చొని అటు కర్నూలు, ఇటు రాయచూర్ ప్రాంతాలకు వెళ్లే బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది.

ఎండలో నిల్చోవాల్సిందే..



మేము మానవపాడు నుంచి పచ్చర్ల గ్రామానికి వెళ్తున్నాం. గంటసేపు ఎండలో నిల్చున్నాం. బస్సు రాలేదు. కూర్చోవడానికి ఎలాంటి సదుపాయం లేదు. గంటల తరబడి నిల్చోవాలంటే చాలా కష్టంగా ఉంది. షెడ్డు నిర్మించి మహిళలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి.

– తిమ్మమ్మ, మానవపాడు

బస్టాండ్‌కు ఎలా వెళ్లేది..



శాంతినగర్ బస్టాండ్ ఊరి బయట నిర్మించారు. మాఇంటి నుంచి రెండు కిలోమీటర్లు నడవాలి. అంతదూరం వెళ్లలేక ఇక్కడే నిల్చొని బస్సు ఎక్కుతుంటాం. బస్సు వచ్చే వరకు రోడ్డుపైనే నిల్చోవాలి. అటు బస్టాండ్‌కు నడవలేక, ఇటు బస్సు కోసం వేచి చూస్తూ నిలబడలేక సతమతమవుతున్నాం.

– పార్వతమ్మ, శాంతినగర్

వర్షం వస్తే తడవాల్సిందే..



మేము కర్నూలుకు వెళ్లేందుకు బస్సు కోసం ఎదురుచూస్తున్నాం. బస్టాప్ లేనందున రోడ్డు సమీపంలో నిల్చున్నాం. వర్షం కురిస్తే తడవాల్సిన పరిస్థితి ఉంది. అప్పట్లో పోలీసులు తాత్కాలిక షెల్టర్ నిర్మించి మాకు ఉపకారం చేశారు. రోడ్డు వెడల్పు చేస్తామంటూ షెడ్డును తొలగించారు. బస్సులకు వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంది.

– స్వాతి, శాంతినగర్

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



అయిజలో తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేస్తున్న చేనేత కార్మికులు

గద్వాల: జాతీయ చేనేత దినోత్సవాన్ని బీజేపీ రాష్ట్రశాఖ పిలుపు మేరకు మహిళా మోర్చా నాయకులు చేనేత కార్మికుల ఇళ్లకు వెళ్లి వారి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం రాఘవేంద్ర కాలనీలోని చేనేత కార్మికుల దంపతులను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా నాయకులు కృష్ణవేణి, బండల పద్మావతి, జయశ్రీ పాల్గొన్నారు.

జాతీయ చేనేత దినోత్సవాన్ని జిల్లా పద్మశాలి సేవా సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయ స్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చేనేత జెండాను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పులిపాటి వెంకటేష్ ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించి, కొండాలక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ కళాశాలలో సైతం చేనేత దినోత్సవం నిర్వహించారు.

అయిజ: జాతీయ చేనేత కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో చేనేత కార్మికులు నీలకంఠేశ్వర స్వామి ఆలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు బస్వరాజు, జగన్నాథ్, రాణా, వెకంటేష్, తులసీరామ్, జంబయ్య, శంకర్, తిమ్మప్ప, శేఖర్ పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు సన్మానం

జాతీయ చేనేత కార్మికుల దినోత్సవం సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి పట్టణంలోని భరత్‌నగర్‌లో చేనేత కార్మికులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో భీమసేన రావు, ప్రదీప్ కుమార్, భగత్‌రెడ్డి, రఘు, రాజశేఖర్, జమ్మన్న, భీమేష్; వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రతివార్డు పరిశుభ్రంగా ఉండాలి



అలంపూర్‌లో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ



పుల్లూరు పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న ఉపాధ్యాయులు


అలంపూర్: మున్సిపాలిటీలోని ప్రతి వార్డు పరిశుభ్రంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. అలంపూర్ మున్సిపాలిటీలో స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా చేపడుతున్న పనులను మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ సరస్వతి బుధవారం పరిశీలించారు. మున్సిపల్ ప్రత్యేక అధికారి శ్రీధర్ రెడ్డి ఆదేశాల మేరకు ఆయా వార్డులో నీరు నిలిచిన ప్రాంతాలను గుర్తించి ఎర్రమట్టితో పూడ్చి వేసే పనులు చేపట్టారు. మిషన్ భగీరథ ట్యాంకులపై పక్షులు జంతువులు ట్యాంకుల్లో పడకుండా సప్‌లై లైన్‌లకు జాలీలు ఏర్పాటు చేశారు.

ఉండవెల్లి: మండలంలోని మెన్నిపాడు, పుల్లూరు గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనంపై అధికారులు మొక్కలు నాటి పరిశుభ్రతపై ఆరా తీశారు. బుధవారం మెన్నిపాడులో ఎంపీఓ తిరుపతన్న మొక్కలు నాటి, ఇంకుడుగుంతలపై ఆరా తీశారు. అనంతరం పుల్లూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సువార్తమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజోళి: గ్రామాలు స్వచ్ఛదనంగా ఉన్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని మండల ప్రత్యేకాధికారి ప్రసాద్‌రావ్ అన్నారు. మండల కేంద్రంతో పాటు, తూర్పుగార్లపాడు గ్రామాల్లో ఆయన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

మానవపాడు: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీఓ తిరుపతన్న, మానవపాడు ఎంపీఓ భాస్కర్ తెలిపారు. మండలంలోని ఎ.బుద్దిపాడులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతోనే అభివృద్ధి



పాఠశాల ఆవరణలో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ డీపీఎం రామ్మూర్తి

ధరూరు: అందరి భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని డీఆర్‌డీఏ డీపీఎం రామ్మూర్తి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సీపీఎస్ పాఠశాలలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ కార్మికులతో పిచ్చిమొక్కల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణారెడ్డి మాట్లాడారు. గ్రామంలోని పాఠశాల వద్ద పిచ్చి మొక్కలు పెరిగి విద్యార్థులకు ఇబ్బందిగా ఉండడంతో వాటిని తొలగించే పనులు చేపట్టామన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో యువత ముందుకొచ్చి సేవా కార్యక్రమాలు చేస్తే మంచి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఎం యోగేందర్, సీసీ జయరాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో 'హర్‌ఘర్ తిరంగా'

గద్వాల: బీజేపీ ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 8, 9వ తేదీల్లో సన్నాహక సమావేశాలు పూర్తి చేయాలన్నారు.ఈ నెల 10, 11వ తేదీల్లో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వారి విగ్రహాల దగ్గర నివాళులర్పించాలన్నారు. 12,13వ తేదీలలో యువమోర్చా తిరంగా యాత్ర, మహిళా మోర్చా ఆధ్వర్యంలో స్కూటీల ర్యాలీ ఉంటుందన్నారు. సమావేశంలో నాయకులు ఉన్నారు.

కల్యాలక్ష్మి చెక్కులపై చెల్లని తేదీ

మానవపాడు: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులపై చెల్లని తేదీ ఉందని, మానవపాడు ఎస్‌బీఐ బ్యాంక్‌కు వెళ్తే ఇవి చెల్లవని చెప్పడంతో లబ్ధిదారులు ఆందోళన చెందారు. కాంగ్రెస్ నాయకులు మహ్మద్ సిరాజ్,నాయకులు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఫోన్‌లో మానవపాడులో తహసీల్దార్ వాహీదాఖాతూన్ దృష్టికి తీసుకెళ్లి, ఆర్‌డీఓ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు లబ్ధిదారులు ఎవరూ అధైర్య పడొద్దని, బ్యాంకుల్లో చెక్కుల ఇస్తే వారి ఖాతాలో డబ్బులు జమా అవుతాయని తెలిపారు.

పోషకాహారం తీసుకోవాలి

మల్దకల్: గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించి వారి ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీఓ చెన్నయ్య అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. బుధవారం మల్దకల్‌లోని 1,2,3వ అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం పంపిణీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి, టీచర్లు లక్ష్మీరంగమ్మ, మహేశ్వరమ్మ ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

గద్వాల అర్బన్: నేషనల్ హెల్త్ మిషన్ పల్లెదవాఖానల్లో మిడిల్ ప్రొవైడ్ డాక్టర్లుగా పని చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ఎంఎల్‌హెచ్‌పీలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోండి

అయిజ: నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఇన్‌చార్జి ఎంఈఓ నరసింహకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల నిబంధనలకు వ్యతిరేకంగా కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు.

బురదలో చిక్కిన స్కూల్ బస్సు

మానవపాడు: ప్రైవేట్ పాఠశాల బస్సు బురదలో చిక్కడంతో విద్యార్థులు ఇబ్బందులు పడిన సంఘటన మండల కేంద్రంలోని చెన్నిపాడు-పెద్దపోతులపాడు వంతెనపై చోటుచేసుకుంది. కొన్ని నెలల నుంచి వంతెన నిర్మాణ పనులు సాగుతున్నాయి. శాంతినగర్ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు 20మంది విద్యార్థులతో వెళ్తుండగా చెన్నిపాడు-పెద్దపోతులపాడు మధ్య బ్రిడి వద్ద బురదలో బస్సు చిక్కుకుంది. గంటపాటు ఇరు గ్రామాల ప్రజలు శ్రమించి బస్సును బయటకు తీశారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు మార్గం బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నేర నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్



మానవపాడు: నేర నియంత్రణ కోసం రహదారి ప్రమాదాల నివారణకు, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నామని ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపారు. బుధవారం మండలంలోని జాతీయ రహదారిపై మానవపాడు స్టేజీలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ద్విచక్ర వాహనాదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసులు, ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాన్ని సవరించాలి

అలంపూర్ రూరల్: ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతన చట్టాన్ని సవరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శు లు రేపల్లె దేవదాసు, జి. రాజు అన్నారు. మండలంలోని గొందిమల్ల, బుక్కాపూర్, కోనేర్ గ్రామాల్లో ఉపాధిహా మీ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యల పై వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సర్వే చే పట్టారు. ఉపాధి కూలీలకు ఏడాదికి 200 రోజులు పనులు కల్పించాలని, రోజుకు రూ.600 కూలీ చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మానవపాడులో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజేయుడు

అలంపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న పలువురిని ఎమ్మెల్యే బుధవారం పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వారితోపాటు నాయకులు నాగేశ్వర్ రెడ్డి, రఘురెడ్డి, మద్దిలేటి ఉన్నారు.

కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో ఎమ్మెల్యే సీఎం సహాయ నిధి రూ.5లక్షల ఎల్‌ఓసీని సింగవరం గ్రామానికి చెందిన కురువ కృష్ణ కుటుంబ సభ్యులకు అందజేశారు. సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.6లక్షల ఎల్‌ఓసీని అలంపూర్ మండలం కాశీపురం గ్రామానికి చెందిన మైథిలీ ఆపరేషన్‌కు కోసం ఎమ్మెల్యే అందజేశారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

మానవపాడు: మండలంలోని వివిధ గ్రామాల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే విజేయుడు చెక్కుల పంపిణీ చేశారు. మండలంలో 75మంది లబ్ధిదారులకు చెక్కుల అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వాహీదా ఖాతూన్, మాజీ ఎంపీపీ అశోక్‌రెడ్డి, బోరవెల్లి శేషిరెడ్డి, ఎంపీఓ భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ సర్దార్ మియ్య, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని పీఏసీఎస్ నూతన గోదాంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే విజయుడు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సలీముద్దీన్, డీటీ రమణ, పీఏసీఎస్ చైర్మన్ గజేందర్ రెడ్డి, మాజీ సర్పంచులు లోకేశ్వర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ దేవన్న, మాజీ ఎంపీటీసీలు రాజశేఖర్ పాల్గొన్నారు.

శాంతినగర్: శాంతినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బేకరిని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం బేకరి యజమానికి శుభాకాంక్షలు తెలిపారు.

గట్టు: మండలంలోని చాగదోణలో మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ సీఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో శివప్ప, నర్సింహులు, గంగాధర్ పాల్గొన్నారు.

పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న కార్యదర్శి హారిక

ఎర్రవల్లిచౌరస్తా: పుట్టిన ప్రతి బిడ్డకు తల్లి ముర్రుపాలు తప్పకుండా తాగించాలని పంచాయతీ కార్యదర్శి హారిక అన్నారు. బుధవారం ఇటిక్యాల మండలంలోని మొగిలిరావుల చెర్వులో అంగన్‌వాడీ టీచర్ సుల్తానా ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టిన వెంటనే బిడ్డలకు ముర్రుపాలు తాగిస్తే చిన్నారులకు అది మొదటి వ్యాక్సిన్‌గా పనిచేస్తుందన్నారు. చిన్నారులకు ఆరు నెలల వరకు తల్లిపాలనే ఇవ్వాలన్నారు. దీని వల్ల పిల్లల్లో రోగనిరోధక శక్తిని పెంచుతుందన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఇళ్ల కోసం పోరాటం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, లబ్ధిదారులు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలో లక్కీడిప్ ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేసేంతవరకు పోరాడుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి అన్నారు. బుధవారం లబ్ధిదారులతో కలిసి కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో 10 ఎకరాల ప్రభుత్వ భూమిలో రూ.68కోట్లకు పైగా వెచ్చించి డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించారని తెలిపారు. లక్కీడిప్ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి ఏడాది అయినప్పటికీ ఇప్పటి వరకు లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్లు అందించలేదన్నారు. గోన్‌పాడులో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు శిథిలావస్థకు చేరాయని, దౌదర్‌పల్లిలో ఇళ్ల పరిస్థితి ఇదే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అనంతరం కలెక్టర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పేరు నర్సింహ, వెంకటరాజు, ఎల్లప్ప, రాజేష్, నరేందర్, లబ్ధిదారులు తదితరులు ఉన్నారు.

బ్రిడ్జిపై బురద..



మానవపాడు: మండలంలో వివిధ గ్రామాల్లో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్లు చిత్తడిగా మారాయి. మానవపాడు నుంచి గోకులపాడు వెళ్లే రోడ్డు, మానవపాడు నుంచి చెన్నిపాడు, పెద్దపోతులపాడు గ్రామాల మధ్యన ఉన్న బ్రిడ్జిపై బురదతో రోడ్లు ప్రమాదకరంగా మారాయి. గోకులపాడుకు వెళ్లే బ్రిడ్జిపై గుంతలు ఏర్పడడంతో మట్టి వేశారు. దీంతో బురద ఏర్పడి వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాలనీలు జలమయం



అయిజ: మున్సిపాలిటీలోని వివిధ కాలనీలు మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి జలమయమయ్యాయి. ప్రయాణికులు బుధవారం రోడ్లపై వెళ్లేందుకు అనేక ఇబ్బందులకు గురయ్యారు. పాతబస్టాండ్ కూడలి రోడ్లు మురుగుతో నిండిపోయాయి. బుడుగ జంగాల కాలనీ, గాజుల పేట కాలనీలు వర్షంనీటితో చెరువును తలపించాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



బంగారు దుకాణాదారులతో మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ అధికారులు

గద్వాల అర్బన్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆ శాఖ ఎస్ఈ భాస్కర్ అన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు బుధవారం జిల్లా కేంద్రంలోని స్వర్ణకార కాంప్లెక్స్‌లో బంగారు దుకాణాదారులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్ఈ మాట్లాడుతూ ప్రతి బుధవారం విద్యుత్ సమస్యలపై ముఖాముఖి నిర్వహించి తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బంగారు వ్యాపారులు తమ దృష్టికి తీసుకొచ్చిన స్వర్ణకార కాంప్లెక్స్‌లో సర్వీస్ వైర్లు సమస్యపై కొత్త లైన్లు ఏర్పాటు చేస్తామన్నారు. గతం కంటే మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఈ ఎంఓ శేషగిరి రావు, ఏడీఈ రమేష్ బాబు, ఏఈ శివకుమార్, అసోషియేషన్ సభ్యులు ఉన్నారు.

చేనేత జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు

గద్వాల: టీపీసీసీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడిగా గద్వాలకు చెందిన చిన్ని నాగరాజు నియామకయ్యారు. బుధవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ నియామక పత్రాన్ని అందజేశారు. గద్వాల పద్మశాలి సంఘం నా యకులు, చేనేత కార్మిక సంఘం నాయకులు అభినందించారు.

మల్దకల్ సీడీపీఓ బదిలీ

మల్దకల్: మల్దకల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓగా విధులు నిర్వహిస్తున్న కమలాదేవి బదిలీ అయ్యారు. ఐదేళ్ల నుంచి మల్దకల్ సీడీపీఓగా విధులు నిర్వహిస్తూ ఇటీవల మహబూబాబాద్‌కు బదిలీ అయినట్లు ఆమె తెలిపారు.